క్లుప్తంగా

17న తొలి ఏకాదశి

కొడంగల్ : ఈనెల 17న బుధవారం ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పూజలు నిర్వహిస్తున్నట్లు పట్టణంలోని శ్రీవారి ఆలయం అర్చకులు తెలిపారు. 17న ఉ.10 గంటలకు విష్ణు సహస్ర నామ పారాయణం ఉంటుందన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అందరూ పఠించాలి

అనంతగిరి: భగవద్గీతా పారాయణాన్ని అందరూ పఠించాలని వికారాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ మంజుల అన్నారు. ఆషాఢమాసం పురస్కరించుకుని శనివారం పలు ఆలయాల్లో గీతావాహిణి బృందం ఆధ్వర్యంలో శ్రీమత్ భగవద్గీతా సామూహిక పారాయణం కొనసాగింది. ఇందులో భాగంగా ఎన్నెపల్లిలో మున్సిపల్ చైర్పర్సన్ మంజుల పాల్గొని పఠించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో గీతావాహిని అధ్యక్షురాలు కౌన్సిలర్ శ్రీదేవి ఆనంద్‌రెడ్డి, కౌన్సిలర్లు స్వాతి రాజ్‌కుమార్, మంజులముత్యంరెడ్డి, అనంత్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, గీతా వాహిని సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న భాస్కర్

దోమ : మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయానికి గ్రామానికి చెందిన భాస్కర్ రూ. 20 వేల విరాళం అందజేశారు. శనివారం గ్రామ మాజీ సర్పంచ్ రాఘవేందర్‌రావుకు నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్య, గ్రామస్తులు ఆనందం, రాములు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఓపెనింగ్‌కు రావాలని ఆహ్వానం



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న తండావాసులు

కొడంగల్ : మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న మొత్కులబండ తండాకు త్రీఫేస్ కరెంటును ఏర్పాటు చేశారు. కాగా, ఓపెనింగ్‌కు రావాలని గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని ఆహ్వానించారు. శనివారం తండాకు చెందిన ఎస్టీ సెల్ అధ్యక్షుడు తార్యానాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు వెళ్లి తిరుపతిరెడ్డిని కలిసి శాలువా కప్పి సన్మానించారు. గతంలో సింగిల్ ఫేజ్ కరెంటు ఉండేదన్నారు. ప్రస్తుతం త్రీఫేస్ కరెంటును ఇచ్చారని పేర్కొన్నారు. కరెంటు సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సామ్యానాయక్, గోపాల్‌నాయక్, నర్సయ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

తహసీల్దార్ కిషన్



చిన్నారితో మాట్లాడుతున్న తహసీల్దార్

పెద్దేముల్: మండలంలోని కందనెల్లితండా పాఠశాలకు చెందిన చిన్నారులు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కిషన్, కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఆంజయ్య, వైస్ చైర్మన్ నారా యణరెడ్డిలు తాండూరు మాతశిశు ఆస్పత్రికి వెళ్లి చిన్నారి స్వాతిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. మొత్తం 19 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, వారిలో 18 మంది ఆరోగ్యం మెరుగుపడటంతో వారిని శుక్రవారం రాత్రి ఇంటికి పంపించారు. అనంతరం స్వాతి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వర్షాకాలం ఉన్నందున ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని పాఠశాలలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల విద్యాధికారి వెంకటయ్యకు సూచించారు.

హెచ్చరిక బోర్డులు పెట్టాలి

బంట్వారం: మూలమలుపు రోడ్ల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని పలువురు వాహనదారులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోట్‌పల్లి మండలంలోని కొత్తపల్లి మూలమలుపు ప్రమాదకరంగా ఉందన్నారు. అలాగే, చెరువు సమీపంలో కూడా ఇలాంటి పరిస్థితే ఉందని తెలిపారు. రొంపల్లి, సల్బత్తాపూర్ మార్గంలో మూలమలుపుల వద్ద తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు.

పేదోడి గూడుకు మోక్షమెన్నడో?

‘గత ప్రభుత్వాలకు భిన్నంగా డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ సర్కారు ఏ ఒక్క పేదోడికి కూడా డబుల్ ఇళ్లు నిర్మించి ఇచ్చిన పరిస్థితి లేదు. ప్రస్తుతం సర్కారు మారింది.. బీఆర్‌ఎస్ కట్టించిన డబుల్ ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. కానీ, అవసరమైన ప్రక్రియను మాత్రం అధికార ఘనం ప్రారంభించడం లేదు.’

- ఏళ్లు గడుస్తున్నా పంపిణీ కాని డబుల్ ఇళ్లు
- శిథిలావస్థకు చేరుతున్న వైనం
- అందని ద్రాక్షలా సొంతింటి కల



అడవివెంకటాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు



పశువుల పాకగా మారిన డబుల్ బెడ్రూం ఇళ్ల పరిసరాలు

కుల్కచర్ల: పేదల సొంతింటి కల కలగానే మారుతోంది. ఏళ్లకు ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు తమకు సొంతిళ్లు నిర్మించి ఇవ్వడం లేదని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల మండలం, అడవివెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో 2017లో 30 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించింది. కానీ, వాటిని ప్రజలకు ఇచ్చేందుకు అవసరమైన కార్యాచరణను మాత్రం పట్టించుకోకపోవడంతో అవి నిర్మానుష్యంగా మారి సమీప పొలాల రైతులకు పశువుల కొట్టాలుగా మారిన దుస్థితి నెలకొంది.

పంపిణీకి నోచుకోని వైనం

మండలంలో 44 గ్రామ పంచాయతీలు, 60వేల జనాభా ఉన్నారు. కాగా, నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గత బీఆర్‌ఎస్ సర్కార్ అడవివెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో 30ఇళ్లను నిర్మించింది. అనంతరం వివిధ కారణాలతో వాటిని పంపిణీ చేయలేదు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరినా వాటిని పంపిణీ చేసేందుకు అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదు. ఇళ్లు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, నిర్మించిన ఇళ్లను ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తులు స్వీకరించి సంవత్సరం..

డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేసేందుకు గత సంవత్సరం 2023 జూన్‌లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని రెవెన్యూ అధికారులు జిల్లా పాలనాధికార్యాలయానికి పంపించామని పేర్కొంటున్నా ఆ ఫైలు ముందుకు వెళ్లకపోవడంతో ఇళ్ల పంపిణీ అటకెక్కింది.

శిథిలావస్థకు చేరిన డబుల్ ఇళ్లు..

2017లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీకి నోచుకోకవడంతో శిథిలావస్థకు చేరాయి. కొన్నిచోట్ల పగుళ్లు రావడం, కిటికీలు పగిలిపోవడం జరగగా మరికొన్ని ఇళ్ల ముందు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఇబ్బందికరంగా మారాయి. దీంతో అక్కడి పొలాల రైతులు తమ పశువులను కట్టేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాం



తమ పెంకుటిల్లు వర్షానికి ఉరుస్తుంది. తమకు ఇళ్లు వచ్చే అవకాశం ఉందని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నా ఇంత వరకు పంపిణీని ప్రారంభించలేదు. ఇదిగో ఇస్తాం.. అది గో ఇస్తాం అంటున్నారు తప్పిస్తే, డబుల్ బెడ్రూం ఇళ్లను అందించడం లేదు. కట్టిన ఇళ్లు కూలి పోయేలా మారుతున్నాయి.

– పాత్లవత్ లక్ష్మీబాయి, అడవివెంకటాపూర్

పంపిణీ జిల్లా అధికారుల పరిధిలోనే..



అడవివెంకటాపూర్‌లో నిర్మించిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పంపిణీకి సిద్ధం చేశాం. అనంతరం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ చేస్తుండగా, లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేయడం జిల్లా అధికారుల పరిధిలో ఉంది.

– మణికుమార్, ఏఈ పంచాయతీరాజ్

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

పెద్దేముల్: మిలీనియం మెథడిస్ట్ చర్చి సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మంబాపూర్ గ్రామంలో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మెథడిస్ట్ చర్చి తాండూరు డిస్ట్రిక్ సూపర్‌టెండెంట్ జనార్దన్, సికింద్రాబాద్ సూపర్‌రెడ్డి సామేల్‌లు మాట్లాడుతూ..ఏసుక్రీస్తు ఈ లోకంలో వైద్యసేవలు ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, సర్పంచ్‌లు క్రిష్టారెడ్డి, శ్రావన్‌కుమార్, ప్రకాశం, శ్రీనివాస్, పాస్టర్లు సంపత్‌కుమార్, విజయకుమార్, భాస్కర్, అబ్రహం, తియోతి, డాక్టర్లు హెలేన్, అపర్ణ, ప్రదీప్, అనిల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

యాలాల: మండలంలోని రాస్నం ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు తోటి సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం వీరేశం, మోహనయ్య, ప్రశాంత్, మాధవి, ప్రాథమిక పాఠశాల నుంచి శ్రీనివాస్, కృష్ణ, రాజేష్, మమత, తదితరులను సన్మానించారు. పాఠశాలలో నాణ్యమైన విద్యాభోదనతో పాటు విద్యార్థుల వందశాతం హాజరు, పరీక్షా ఫలితాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనేలా ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారని ఈ సందర్భంగా గ్రామస్తులు పేర్కొన్నారు. అనంతరం కొత్తగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించి ఆహ్వానించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం సతీష్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నరహరిరెడ్డి, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, పావని, లాజర్, ఆనంద్, సంగీత, సారిక తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బస్సు ట్రిప్పులు పెంచాలని వినతి



స్పీకర్‌కు విన్నవిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామానికి నడుపుతున్న ఆర్టీసీ బస్సు ట్రిప్పులను పెంచాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరారు. శనివారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో స్పీకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ నుంచి వయా తరిగోపుల మీదుగా ప్రతిరోజు కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే బస్సు నడుపుతున్నారని స్పీకర్ దృష్టికి తెచ్చారు. తర్వాత బస్సుకు వెళ్లాలన్న వీలులేదని విచారం వ్యక్తం చేశారు. నాగారం, మైలారం, తరిగోపుల, జైదుపల్లి, గోదంగుడల మీదుగా వికారాబాద్‌కు వెళ్లడానికి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో ప్రయాణికులు, విద్యార్థులు, కూరగాయలు తీసుకెళ్లే రైతులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన స్పీకర్ ఆర్టీసీ డీఎంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్పీకర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచు కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుకారాం, నర్సింహులుగౌడ్ అనంతయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా అడుగులు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

దుద్యాల్: గత నెల 8న కొడంగల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శంకుస్థాపన చేసిన రోడ్డు విస్తరణ పనులను ప్రాజెక్ట్ మేనేజర్ కొండల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. మండలంలోని కుదురుమల్ల గ్రామం నుంచి పోలేపల్లి గ్రామ శివారు వరకు రూ. 50 కోట్లతో దుద్యాల్ నుంచి బొంరాస్‌పేట మండలం లింగంపల్లి గేట్ వరకు రూ.28 కోట్లతో విస్తరించనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక కొడంగల్ అభివృద్ధిలో పరుగులు పెడుతుందని, రానున్న రోజుల్లో మరెన్నో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తారని అన్నారు. కొడంగల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, దుద్యాల్ మండల అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు కృష్ణ, ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఖాజా, రేవంత్ సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌కు సన్మానం



నర్సిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

యాలాల: తాండూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన నర్సిరెడ్డిని శనివారం సంగెం కుర్దు మాజీ సర్పంచ్ దంపతులు హన్మంతు, శంకరమ్మలు సన్మానించారు. రైతు కుటుంబ నేపథ్యం ఉన్న నర్సిరెడ్డికి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా అవకాశం రావడం హర్షణీయమన్నారు. రైతులకు లాభదాయకమైన నిర్ణయాలు తీసుకొని కమిటీని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. రాజకీయ భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని కోరారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కొడంగల్ రూరల్ : పట్టణశివారులో వెలసిన పురాతన సిద్ధనొంపు ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొడంగల్ మహాదేవుని ఆలయ భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, సిందూర లేపనం, విశేష అలంకరణ చేశారు. అష్టోత్తర శత నామావళి, దూప దీప నైవేద్యాలను సమర్పించారు. భజ్గాలు వేస్తూ స్వామివారిని వేడుకున్నారు. స్వామివారి సన్నిధిలో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి సన్నిధిలో భజనలు చేస్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: పట్టణ కేంద్రంలో నేడు (ఆదివారం) ఉ.11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ ఖజా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ పనుల కారణంగా పట్టణ కేంద్రంలోని బహార్‌పేట్, హనుమాన్ దేవాలయం, వల్లబనగర్, రంగాపూర్‌తండాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

బస్సును యథావిధిగా నడిపించాలి

బంట్వారం: తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ డిపో బస్సు చాలాకాలంగా రొంపల్లి, బంట్వారం మీదుగా రోజుకు రెండు ట్రిప్పులు జహీరాబాద్‌కు వెళ్లేదని, గతవారం రోజులుగా రోడ్డు బాగోలేదనే సాకుతో పూర్తిగా రద్దు చేశారని రొంపల్లి గ్రామస్తులు శనివారం ఓ ప్రకటనలతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు మాట్లాడారు. వారం రోజులుగా జహీరాబాద్‌కు వెళ్లే బస్సును డిపో మేనేజర్ పూర్తిగా రద్దు చేశారని ఆరోపించారు. సమస్యను పలుసార్లు డీఎం దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదన్నారు. బస్సు రాకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా డీఎం స్పందించి యథావిధిగా జహీరాబాద్‌కు బస్సును నడిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిచో డిపో ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు.

లక్ష్యం మేర మొక్కలు నాటాలి

ఎంపీడీఓ రాములు

బంట్వారం: వన మహోత్సవంలో భాగంగా మండలంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాల్సి ఉంటుందని ఎంపీడీఓ రాములు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 4500 మొక్కలు నాటాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే నర్సరీల్లో 18 రకాల మొక్కలను సిద్ధంగా ఉంచామని చెప్పారు. గ్రామాల్లో గుంతల తవ్వకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. వర్షాలు బాగా కురువగానే మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతామన్నారు. ఇందుకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్ధంగా ఉండాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను కాపాడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నిరాధార ఆరోపణలు సరికాదు

యాలాల: కుటుంబ పాలన గురించి మాట్లాడే నైతిక హక్కు రోహిత్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం సీనియర్ నాయకుడు సత్యనారాయణరెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే బీఎంఆర్ కుటుంబంపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. గత ఐదేళ్ల పాలనలో రోహిత్‌రెడ్డి కుటుంబ సభ్యుల జోక్యాన్ని ప్రజలు మరిచి పోలేదన్నారు. మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలకతీతంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

నిధులు రావు.. పనులు కదలవు!



అధ్వానంగా మారిన గొల్లచెరువు మినీ ట్యాంక్ బండ్

- నాలుగేళ్లుగా నిలిచిపోయిన గొల్ల చెరువు మినీ ట్యాంక్‌బండ్ పనులు
- రూ.3.40 కోట్ల నిధులతో అభివృద్ధి
- రూ.5 కోట్లు కావాలని ప్రతిపాదనలు
- మంజూరుకు కలగని మోక్షం



కట్టపై డంప్ చేసిన శిథిలాల మట్టి

తాండూరు: పట్టణంలోని గొల్ల చెరువు అభివృద్ధి అటకెక్కింది. ఈ చెరువు కట్టను మినీట్యాంక్ బండ్‌గా మార్చేందుకు 2017లో అప్పటి ప్రభుత్వం రూ.3.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. 2020 వరకు మూడేళ్ల పాటు కొనసాగాయి. కట్ట విస్తరణ, చెరువులోకి దిగేందుకు మెట్లు, బతుకమ్మ ఘాట్ తదితర పనులు చేపట్టారు. కట్టకు ఇరువైపులా వాకింగ్ ట్రాక్ నిర్మించారు. మొత్తం రూ.3.40 కోట్లతో పనులు చేశారు. మరో రూ.5 కోట్లు ఇస్తే పనులు పూర్తవుతాయని, ఇందుకు సంబంధించిన నిధులు మంజూరు చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులు గతంలోనే ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటికీ మోక్షం కలగలేదు.

నిర్వహణ కరువు

పట్టణంలో వాకింగ్ చేసేందుకు సరైన వేదిక లేదు. గొల్లచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చిన తర్వాత మున్సిపల్ శాఖకు బదిలీ చేయలేదు. దీంతో నిర్వహణ లేక అధ్వానంగా మారింది. చెరువుకట్టకు ఇరువైపులా ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. వాకింగ్ ట్రాక్ సైతం నడకకు అనుకూలంగా లేదు. దీనికి తోడు కట్టపై వ్యర్థపు మట్టి, నాపరాతి శిథిలాలను డంప్ చేస్తున్నారు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి

కిలో రూ.120



మోమిన్‌పేట వారాంతపు సంత

మోమిన్‌పేట: ప్రతి రోజు తినే కూరగాయాల్లో తప్పనిసరిగా మూడు ఉండాల్సిందే. పచ్చిమిర్చి, ఉల్లి, టమాట ఇవి లేనిదే కూర ఉడకదు. అలాంటిది నేడు మార్కెట్‌లో కిలో పచ్చిమిర్చి రూ.120లు, టమాట కిలో.100లు, ఉల్లి రూ.100కు మూడు కిలోలు. ఇలా అయితే సామాన్యుడు ఎలా తినాలని ప్రశ్నిస్తున్నారు. మార్కెట్‌లో ప్రతి కూరగాయ సామాన్యులకు అందకుండా పోయింది. కాలిఫ్లవర్ ఒక్కటి రూ.50, క్యాబేజీ, బెండ, దొండ, గోరు చిక్కుడు, వంకాయ, ఆలుగడ్డ, చేమ గడ్డ, బీర, కాకర తదితర కూరగాయలు కిలోకు రూ.60ల పై మాటే. శనివారం మోమిన్‌పేట వారాంతపు సంతలో పచ్చిమిర్చి కిలో రూ.120లు పలికింది. ధరలు తగ్గాలంటే ఇంకా నెల రెండు నెలలు ఆగాల్సిందేనని రైతులు చెబుతున్నారు.

చక్కెర ఫ్యాక్టరీ ఏర్పాటు చేయండి

బంట్వారం: మండలంలోని తొర్మామిడిలో ప్రభుత్వ చక్కెర ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని చెరుకు రైతులు శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తొర్మామిడి, బస్వాపూర్, బొప్పునారం, కోట్‌పల్లి మండలంలోని జిన్నారం తదితర గ్రామాల్లో చెరుకును అత్యధికంగా సాగు చేస్తారని పేర్కొన్నారు. అందుబాటులో చక్కెర ఫ్యాక్టరీ లేకపోవడంతో దూర ప్రాంతాలకు తీసుకెళ్లడం ఆర్థిక భారమతుందన్నారు. తొర్మామిడిలో చక్కెర ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే చెరుకు రైతులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. గతంలో స్థానికంగా ఓ ప్రైవేటు చక్కెర కర్మాగారం ఉండేదని, దానిని చాలా కాలంగా మూసేయడంతో సంగారెడ్డి, యాద్గిరి తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించాల్సి వస్తుందన్నారు.

హైకోర్టు ప్లీడర్‌ని కలిసిన లాల్‌కృష్ణ



శుభాకాంక్షలు తెలుపుతున్న లాల్‌కృష్ణ తదితరులు

పరిగి: హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన అనంత్‌సేన్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రయ్యలు శనివారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వాసి గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులు కావడం గర్వకారణమన్నారు. మున్ముందు మరింత ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.